

దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో బ్లాస్టర్స్ జట్టు విజయం 8లో


వైఎస్సార్‌సీపీతోనే ముస్లింలకు భద్రత 8లో


చందనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు 8లో

చోడవరం సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్



చోడవరం.. జన తరంగం

నిప్పులు చెరిగిన మండుటెండలో వెల్లువెత్తిన ప్రజాభిమానం ఆత్మీయ జల్లులా మారింది..ప్రియతమ నేత రాకతో చోడవరం జన తరంగమైంది. సిద్ధం సభలు బస్సుయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సీఎం జగన్ మలివిడత ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ జన సందోహదంతో దద్దరిల్లింది. తమ అభిమాన ముఖ్యమంత్రిని చూసేందుకు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సభకు పోటెత్తారు. సీఎం ప్రసంగానికి విశేష రీతిలో ప్రజల నుంచి స్పందన వచ్చింది. వన్స్ మోర్ సీఎం...జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

- సీఎం వై.ఎస్.జగన్ సభకు పోటెత్తిన జన ప్రవాహం
- మండుటెండలోనూ వెల్లువెత్తిన **అభిమానం**
- తరలివచ్చిన మహిళాలోకం.. మార్మోగిన జగన్నినాదం
- రోడ్లన్నీ కిక్కిరిసిపోవడంతో మేడలు, మిద్దెలెక్కిన అభిమానులు
- చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలను ఎండగట్టిన సీఎం

సాక్షి, అనకాపల్లి : చోడవరంలో సోమవారం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ సందర్భంగా ఇటు వడ్డాది వైపు...అటు అనకాపల్లి వైపు రహదారులు జన ప్రవాహంతో కిక్కిరిశాయి. ఉదయం 9 గంటలకే తన అభిమాన నాయకుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు మూడు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమ ప్రియతమ నేత రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూశారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాగానే జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. రోడ్లన్నీ కిక్కిరిసిపోవడంతో సీఎం జగన్‌ను చూసేందుకు జనం మిద్దెలు, మేడలెక్కారు. స్థానిక వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేసి.. సభా ప్రాంగణానికి తరలివచ్చారు.



రోడ్ షోకు బారులు తీరిన జనం

గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి సోమవారం ఉదయం 10.15 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్లో బయలుదేరి 10.47 గంటలకు చోడవరం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి బయలుదేరి 11.10 గంటలకు సభాస్థలి వద్దకు చేరుకున్నారు. 11.15 కు ప్రారంభించిన సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగం 30 నిమిషాల పాటు సాగింది. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. 12.14 గంటలకు హెలికాప్టర్‌లో **అంబేడ్కర్ జిల్లాకు బయలుదేరారు. సభాస్థలి వరకూ రోడ్డుమార్గాన బయలుదేరిన సీఎంకు అడుగడుగునా నీరా'జనం' పలికారు. చోడవరం రోడ్లలో మహిళలు** బారులు తీరి ఆత్మీయ సోదరుడికి హారతులు పట్టారు. అభిమాన నేతను చూసేందుకు మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం తోసుకుంటూ వచ్చారు. వారిని నిలువరించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.

వన్స్ మోర్.. సీఎం జగన్

జగనన్న ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. సీఎం జగనన్న ప్రసంగిస్తున్న సమయంలో సీఎం.. సీఎం.. అంటూ నినాదాలతో సభా ప్రాంగణం మర్మోగిపోయింది. అన్నా..నిన్ను సీఎంగా చేసుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ ప్లకార్డులు చూపిస్తూ నినాదాలు చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో పేపర్‌ను చూపిస్తూ.. ఆయన చేసిన మోసాలను వివరిస్తుంటే..చంద్రబాబు వద్దు..జగనన్నే ముద్దు అంటూ నినాదాలు చేశారు. సీఎం జగన్ ఒక్కో మాట తూటాల పేలింది. ఒకవైపు చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలను చీల్చి చెండాడుతూనే.. మరోవైపు వైఎస్సార్ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని **ప్రజలకు గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో బీజేపీ,టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో హామీలను అమలు చేయకుండా చంద్రబాబు** చేసిన మోసాన్ని వివరించడంతోపాటు ఈ ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ఆమోదయోగ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఎండగట్టారు. చంద్రబాబు కుయుక్తులు చిత్తు చేసేందుకు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 'మేము సైతం సిద్ధం' అంటూ జనం నినదించారు.

మీలో ఒక్కడు...మీ లోకల్...

వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న పార్లమెంట్ అభ్యర్థిగా 'మీలో ఒక్కడైన మీ లోకల్‌ని..మన అభ్యర్థిగా ముత్యాలనాయుడిని ఎంపీగా నిలబెడుతున్నాను. మీ చల్లని ఆశీస్సులు.. దీవెనలతో ఆశీర్వదించండి' అని కోరారు. చోడవరం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న ధర్మశ్రీ అన్నకు మీ ఆశీస్సులుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, శాసనమండలి విప్ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ప్యాకేజీ మహిమ!

తొలుత బీరాలు.. ఆపై బేరాలు

- చివరకు రాజీపడ్డ రెబల్ అభ్యర్థులు
- వారిని నమ్ముకొని నిండా మునిగిన అనుచరులు



సాక్షి, విశాఖపట్నం: అంతన్నారు.. ఇంతన్నారు.. సీటివ్వకపోతే తమ తడాఖా చూపుతామన్నారు. రెబల్‌గా బరిలోకి దిగి తమ సత్తా చాటుతామన్నారు. ఎన్నెన్నో బీరాలు పలికారు.. చివరకు బేరాలకు దిగారు. అన్నట్టుగానే నామినేషన్లు దాఖలు చేసిన వీరు ఉపసంహరణలో తోక ముడిచారు. ప్యాకేజీలతో రాజీపడి ఇన్నాళ్లూ తమను నమ్ముకున్న అనుచరులను నిండా ముంచారు. అయోమయంలోకి నెట్టారు. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులు తొలుత చాలా హంగామా చేశారు. వీరిలో మొదట్లో టికెట్ **దక్కించుకున్న** వారు, టికెట్ ఆశించి ఆశాభంగమైన **వారూ ఉన్నారు.**

- **యలమంచిలి** టీడీపీ టికెట్ ఆశించిన అక్కడ ఇన్‌చార్జి **ప్రగడ నా**గేశ్వరరావు.. పొత్తులో జనసేనకు కేటా**యించడంతో** తన అనుచరులతో పార్టీ కార్యాలయం**లో ఫర్నీచర్** ధ్వంసం చేసి ఆందోళనకు దిగారు. **తొలుత రెబల్**‌గా బరిలోకి దిగుతానన్న ఆయన కొద్ది **రోజులకు మెత్త**బడి ఇప్పుడు జనసేన అభ్యర్థి తరఫున **ప్రచారంలో పా**ల్గొంటున్నారు.
- **అనకాపల్లి** సీటును పొత్తులో జనసేనకు కేటాయించడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ ఆశావహుడు పీలా గోవింద సత్యనారాయణ ఆరంభంలో హడావుడి చేశారు. కొన్నాళ్లకే ఆయన రాజీపడి జనసేన అభ్యర్థి ప్రచారంలో తిరుగుతున్నారు.
- భీమిలి జనసేన సీటు తనకే ఖాయమని నమ్మకంతో ఉన్న పంచకర్ల సందీప్‌ను కాదని ఆఖరి నిమిషంలో టీడీపీ అభ్యర్థి గంటాకు కేటాయించారు. దీంతో తాను గంటాకు సహకరించబోనని తొలుత ప్రకటించి ఆ తర్వాత ఆయన వెంటే తిరుగుతున్నారు. అలాగే ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నాయకుడు కోరాడ రాజబాబు.. గంటా పెద్ద అవినీతి పరుడని, ఆయన ఓటమే తన లక్ష్యమని మీడియా సమావేశంలో ప్రకటించారు. కొద్దిరోజులకే ఆయన తోకముడిచి గంటా ప్రచారంలో ప్రత్యక్షమయ్యారు.
- విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన సీటును ఆశించిన కార్పొరేటర్లు కందుల నాగరాజు, మహ్మద్ సాధిక్‌లు భంగపడ్డారు. అక్కడ టికెట్‌ను వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించడంతో వీరు తిరుగుబాటు చేశారు. ఎన్నికల్లో తన తడాఖా చూపించి వంశీకృష్ణను ఓడిస్తామని మీడియా సమావేశాలు పెట్టి మరీ బెదిరించారు. తీరా ఇప్పుడు వీరిద్దరూ వంశీకృష్ణ పంచకు చేరిపోయారు.
- టీడీపీ మాడుగుల అసెంబ్లీ స్థానానికి ముందుగా పైలా ప్రసాద్‌ను ప్రకటించింది. ఆయన ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న సమయంలో ఇటీవల ఆయన్ను కాదని పెందుర్తికి చెందిన బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించింది. దీంతో పైలా మాడుగుల అసెంబ్లీతో పాటు అనకాపల్లి లోక్‌సభ స్థానానికి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సోమవారం ఆయన తన నామినేషన్లను ఉపసంహరించుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు.
- టీడీపీ అధినేత చంద్రబాబు మొట్టమొదటి సారిగా అరకు అసెంబ్లీ స్థానాన్ని దొన్నుదొరకు ప్రకటించారు. ఆయన ప్రచారం చేసుకుంటుండగా ఆ సీటును బీజేపీకి మార్పు చేశారు. దీంతో షాక్ తిన్న దొన్నుదొర రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించి ఆ తర్వాత రాజీ పడ్డారు.
- పాడేరు టీడీపీ సీటును తొలుత రమేష్‌నాయుడుకు ప్రకటించారు. దీంతో ఆ సీటును ఆశించిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి రెబల్‌గా పోటీ చేస్తానని స్పష్టం చేయడంతో అధిష్టానం ఆమెకే ఖరారు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన రమేష్‌నాయుడు రెబల్‌గా నామినేషన్ వేసి సోమవారం ఉపసంహరించుకున్నారు.
- ఇక రంపచోడవరం టీడీపీ సీటును శిరీషకు కేటాయించడంతో మనస్తాపం చెందిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించి చివరకు నామినేషన్ వేయకుండానే రాజీ పడ్డారు.

ఇలా టీడీపీ, జనసేన టికెట్లు ఆశించిన వారు తొలుత తమ సత్తా చూపుతామని బెదిరించడం, ఇప్పుడు వారంతా తోక ముడిచి ఆయా పార్టీల అభ్యర్థులకే మద్దతు పలకడం అంతా ప్యాకేజీ మహిమేనంటూ వారి అనుచరులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఎవరి స్థాయిలో వారికి బేరాలు కుదరడంతో నిస్సిగ్గుగా ప్రచారాల్లో పాల్గొంటున్నారని వీరు పేర్కొంటున్నారు. వీరిని నమ్మి తాము మోసపోయామని, తమ నేతలు మాత్రం భారీగా లాభపడ్డారని వాపోతున్నారు.

లెక్క తేలింది.. సమరమే

విశాఖ పార్లమెంట్ బరిలో 33 మంది



బొత్స ఝాన్సీ లక్ష్మి,ముత్తంశెట్టి శ్రీనివాసరావు,ఎంవీవీ సత్యనారాయణ, కె.కె.రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ పార్లమెంట్ బరిలో 33 మంది అభ్యర్థులు నిలిచినట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. మొత్తం 39 మంది నామినేషన్లు వేయగా.. పరిశీలనలో ఆరు నామినేషన్లు తిరస్కరించిన సంగతి తెలిసిందే. మిగిలిన వారిలో ఎవరూ నామినేషన్లు ఉపసంహరించుకోకపోవడంతో 33 మంది పోటీ పడుతున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వీరిలో గుర్తింపు పొందిన ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ నుంచి బొత్స ఝాన్సీ లక్ష్మి, టీడీపీ నుంచి శ్రీ భరత్, బీఎస్పీ నుంచి పెదపెంకి శివ ప్రసాదరావు, కాంగ్రెస్ నుంచి పి.సత్యారెడ్డి పోటీలో ఉన్నారు. మిగిలిన వారిలో రిజిస్టర్డ్ పార్టీల నుంచి 14 మంది, స్వతంత్ర అభ్యర్థులు 15 మంది ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో అభ్యర్థులతో జరిగిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకుడు అమిత్ కుమార్, డీఆర్వో కె.మోహన్ కుమార్, వివిధ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు పాల్గొన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 18 మంది నామినేషన్లు ఉపసంహరించుకోగా 101 మంది బరిలో నిలిచారు.



ఆడారి ఆనంద్‌కుమార్, గుడివాడ అమర్‌నాథ్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్

నియోజకవర్గం	ఉపసంహరణ	బరిలో
విశాఖ దక్షిణ	3	16
విశాఖ తూర్పు	1	14
విశాఖ ఉత్తర	2	15
విశాఖ పశ్చిమ	3	13
గాజువాక	2	14
పెందుర్తి	5	14
భీమిలి	2	15
మొత్తం	18	101

పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు

- 1,22,278 మంది బ్యాంకు ఖాతాలకు నగదు జమచేస్తాం
- 42,621 మందికి ఇంటి వద్దనే అందజేస్తాం
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

మహారాణిపేట: సామాజిక పింఛన్ లబ్ధిదారులు పెన్షన్ కోసం గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి తాపం, అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా మే ఒకటో తేదీన డీబీటీ పద్ధతిలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో పింఛన్ మొత్తం జమ చేస్తామన్నారు. పింఛన్ జమ అయిన వెంటనే ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు మేసేజ్ వస్తుందని వివరించారు. జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు 1,64,899 మంది ఉన్నారని, వీరికి రూ.49,77,74,500 పంపిణీ చేయాల్సి ఉంటున్నారు. ఇందులో 1,22,278 మంది బ్యాంకు ఖాతాలకు రూ.36,68,40,000లను మే ఒకటో తేదీన జమ చేస్తామన్నారు. మే రెండో తేదీ సాయంత్రంలోపు పింఛన్ వారి ఖాతాలకు జమ కాకపోతే.. అలాంటి వారికి మూడో తేదీన ఇంటి వద్దనే అందజేస్తామని వెల్లడించారు. మిగిలిన 42,621 మంది పింఛన్‌దారులకు రూ.13,09,34,000లను వారి ఇంటి వద్దనే అందజేస్తామన్నారు. మే 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

'గంట'కు రూ.100!

'రండి బాబూ రండి.. గంటా వారి ప్రచారానికి వస్తే.. గంటకు వంద రూపాయలు. ఆలోచించినా ఆశాభంగం.. వచ్చి.. జై గంటా అంటే చాలు.. మీ చేతిలో వంద నోటు పెడతాం.. రండయ్యా.. ప్లీజ్..'

భీమిలిలో గంటా వర్గం తీరిదీ..

- జనం రాకపోవడంతో గంటా శ్రీనివాసరావు డబ్బుల ఎర
- గంటపాటు వస్తే రూ.100 ఇస్తామంటూ ప్రలోభాలు
- డబ్బులు పంపిణీ చేసేందుకు ప్రత్యేక బ్యాచ్‌లు
- గుడి, బడి అనే తేడా లేకుండా పంపిణీ
- ఎన్నికల కమిషన్ కేసులు పెడుతున్నా పట్టించుకోని వైనం

సాక్షి, విశాఖపట్నం : ఎవరైనా సరే.. ఎలాగైనా సరే.. నోటిస్తే.. ఓటేస్తారు.. ఇదే సిద్ధాంతంతో గత ఎన్నికల్లో మంది రాజకీయాలు చేసిన గంటా శ్రీనివాసరావుకు ఈ సారి భీమిలిలో చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరికీ ఒక రేటు కట్టి గంపగుత్తగా బేరమాడి దిగజారుడు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన గంటాకు ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రచారానికి ప్రజలే కాదు.. సొంత పార్టీ కార్యకర్తలు.. జతకట్టిన బీజేపీ, జనసేన శ్రేణులు కూడా రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. మరో గంటలో ప్రచారం మొదలు పెట్టాల్సి ఉండగా.. గంటా గ్యాంగ్ రోడ్ల వెంబడి తిరుగుతున్నారు. ఎవరు కనిపించినా.. బాబూ.. రండి.. గంట సేపు జెండా పట్టుకొని మా ప్రచారంలో నడవండి. గంటకు ఒక్క నిమిషం కూడా ఎక్కువ ఉండొద్దు. గంట కొట్టగానే.. మీ చేతిలో వంద పెడతాం.. మీకు ఇచ్చిన జెండా మా చేతిలో పెడితే చాలూ.. బాబ్బాబూ.. అమ్మా.. రండమ్మా.. అంటూ బతిమాలుకుంటూ తీసుకొస్తున్నారు. గంట సేపు ప్రచారం మరో పావుగంటలో ముగుస్తుందనగా.. సెకండ్ బ్యాచ్ కోసం వెతుకులాటలు ప్రారంభిస్తున్నారు. ఇలా ప్రతి రోజూ జరుగుతుండటంతో గంటా గ్యాంగ్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. వచ్చిన వారితో గంపగుత్త బేరాలు కూడా మాట్లాడుకుంటున్నారు. చెప్పిన టైమ్‌కి ప్రతి రోజూ వస్తే.. రోజూ డబ్బులిస్తామని బతిమాలుకుంటున్నారు.

నోటు చూపిస్తే.. వాళ్లే వస్తారులే..

ప్రచారానికి జనం దొరకడం లేదనీ.. గంటా శ్రీనివాసరావు ప్రచారానికంటే మేము రామంటే రామని తెగేసి చెబుతున్నారని గ్యాంగ్ లీడర్లు.. గంటా దగ్గర మొరపెట్టుకుంటున్నారు. 'ఎందుకు రారు.. నోట్లు చూపించండి.. వాళ్లే.. తోకలూపుతూ వచ్చేస్తారు. గంటకు వంద కాకపోతే.. మరో యాభై కలపండి.. అప్పటికీ కాదంటే.. ఇంకో వంద ఇస్తామని చెప్పండి.. గెలిచిన తర్వాత.. భీమిలి మొత్తం మనదే కదా.. ఇచ్చిన వందకు వందరెట్లు లాగేద్దామని' తన అనుచరులతో గంటా చెబుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఎరవేస్తున్నా ప్రచారానికి రాకపోవడంతో గంటా ప్రలోభాలు మితిమీరేలా చేస్తున్నాడు.



హారతిస్తే రూ.500, ప్రచారానికి వస్తే రూ.200

కేసులు నమోదవుతున్నా...

మరోవైపు ప్రచారానికి జనం రాకపోవడంతో కొడుకు, తన గ్యాంగ్‌ను వివిధ ప్రాంతాలకు పంపించి ప్రచారం చేయిస్తున్నారు. జనం తనతో కలిసి నడవకపోవడంతో దేవాలయాలు, మసీదుల దగ్గరికి వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. రోడ్లను బ్లాక్ చేసి దారినపోతున్న ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయాలపై సీరియస్ అయిన ఎన్నికల కమిషన్.. గంటా వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేసులు నమోదు చేస్తున్నా.. పదే పదే కోడ్ ఉల్లంఘిస్తూ.. ప్రజల్ని మభ్య పెట్టేందుకు అడ్డమైన వ్యవహారాలు నడిపిస్తున్నారు. గెలుపు కష్టమని తెలిసినా.. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గంటా ప్రలోభాల పర్వంపై భీమిలి ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

విశాఖ అభివృద్ధికి లక్ష కోట్లతో ప్రణాళిక

- రూ. 2,200 కోట్లతో ఐటీ టవర్ల అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, యాంకర్ శ్యామల

మధురవాడ: విజన్ విశాఖ పేరుతో విశాఖను లక్ష కోట్లతో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ చెప్పారు. వాంబేకాలనీలో సోమవారం ఆమె భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖను దేశంలోనే ప్రత్యేకమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ కృషి చేస్తున్నట్టు చెప్పారు. మధురవాడలో రూ. 2,200 కోట్లతో ఐటీ టవర్లు అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖ పరిపాన రాజధాని కాబోతుందని, ఇందులో భీమిలి కీలకం కాబోతుందని చెప్పారు. రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు ఇక్కడకు వస్తాయని తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడతాయన్నారు. మేనిఫెస్టోతో అమ్మ ఒడి, పెన్షన్‌పెంపు, మహిళలకు రూ.3 లక్షల వరకు సున్నా వడ్డీ, నేత, గీత, డ్రైవర్లు ఇలా అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందని చెప్పారు. అధికారం కోసం చంద్రబాబు నాయుడు కొంగ జపం చేస్తున్నారని.. వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, యాంకర్, నటి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రంలోనే విద్యకు విశేష ప్రాధాన్యం

- గ్లోబల్ స్టూడెంట్స్‌గా మన విద్యార్థులను తీర్చిదిద్దడమే సీఎం జగన్ లక్ష్యం
- విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం
- అపుస్మా ఆత్మీయ సమావేశంలో విద్యా శాఖ మంత్రి బొత్స



మంత్రి బొత్సకు వినతిపత్రం అందజేస్తున్న చీఫ్ మెంటర్ కృష్ణారెడ్డి

డాబాగార్డెన్స్: ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారని, స్వాతంత్ర్యం వచ్చిన దేశంలో ఏ రాష్ట్రం ఈ స్థాయిలో ప్రాధాన్యమివ్వలేదని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మన విద్యార్థులను గ్లోబల్ స్టూడెంట్స్‌గా తయారు చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పరిపాలన సాగిందన్నారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, తద్వారా అక్షరాస్యత శాతం పెరిగిందన్నారు. విద్యలో అగ్రగామిగా ఉన్న కేరళ రాష్ట్రాన్ని త్వరలోనే అధిగమిస్తామన్నారు. విశాఖపట్నం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, సిబ్బంది ఆత్మీయ సమావేశం సోమవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) చీఫ్ మెంటర్ ఎ.కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి బొత్స మాట్లాడారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులు తీసుకొస్తున్నట్లు చెప్పారు. పేద పిల్లలకు మంచి విద్యనందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నట్లు తెలిపారు. మూడో తరగతి నుంచి టోఫెల్ శిక్షణతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐబీ స్టడీ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. 12 ఏళ్ల తర్వాత ఇంటర్నేషనల్ స్టూడెంట్స్‌గా రాష్ట్ర విద్యార్థులు అభివృద్ధి చెందనున్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐబీ సంయుక్త ఆధ్వర్యంలో సర్టిఫికెట్ అందుకుంటారని చెప్పారు. దేశంలో ఏ పోటీ పరీక్ష జరిగినా మన రాష్ట్ర విద్యార్థి మొదటి స్థానంలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అని వెల్లడించారు. మన రాష్ట్ర భవిష్యత్, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సీఎం జగన్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

అమరావతి రెవెన్యూ జనరేట్ చేయగలదా?

అమరావతిని రాజధాని చేస్తే ఎలా రెవెన్యూ జనరేట్ చేయగలదో ప్రతిపక్షాలు చెప్పాలన్నారు. అన్ని వనరులు ఉన్న విశాఖను పరిపాలన రాజధానిని చేస్తే.. రాష్ట్రం ఆర్థిక ప్రగతి సాధిస్తుందన్నారు. విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరమన్నారు. రైల్వే, పోర్టు, జల రవాణాతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి సాధించిందన్నారు. ఇటువంటి మహా నగరాన్ని రాజధాని చేస్తే తప్పేంటో చెప్పాలని విపక్షాలను మంత్రి బొత్స ప్రశ్నించారు.

మీ సమస్యలు తెలపండి

ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తెలపండి.. పరిష్కరించే బాధ్యత తనదని అసోసియేషన్ ప్రతినిధులకు బొత్స హామీనిచ్చారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను బొత్సకు లిఖిత పూర్వకంగా అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఎంవీ రావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుంకర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా కోశాధికారి శేషు, ఉపాధ్యక్షుడు రామునాయుడు, భీమిలి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసరావు, డాక్టర్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం రోజు భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం చందనోత్సవ ఏర్పాట్లపై జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మే 10న జరిగే వరహాలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవ కార్యక్రమానికి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారికి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. షిఫ్టుల వారీగా పారిశుధ్య కార్మికులను నియమించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందివ్వడంతో పాటు వీధి కుక్కలు, పందులు, పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈగలు, దోమలు లేకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని ప్రజారోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. రోడ్ల కిరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని, హోర్డింగ్‌లు, అస్తవ్యస్తంగా ఉన్న అనధికారిక కేబుల్ వైర్లు తొలగించి భక్తులు గ్రహించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్‌కు అనుసంధానం చేసి నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావుకు సూచించారు. రోడ్లకిరువైపులా, సెంట్రల్ మీడియన్లలో మొక్కల నిర్వహణ చేపట్టాలని డీడీహెచ్ దామోదరరావును ఆదేశించారు. దేవస్థానం అధికారులు, పోలీస్ అధికారులను సమన్వయం చేసుకొని కొండపైన, దిగువన పర్యవేక్షించాలని జోన్-2, జోన్-8 జోనల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీసీఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు ఖర్చు చేస్తేనే జనం వస్తారు

- గుడులు కడుతున్నాం విరాళాలివ్వండి అని అడుగుతారు
- నేను మనీ పాలిటిక్స్‌ను నమ్మను
- ఎంపీ అభ్యర్థయితే డబ్బు ఖర్చు పెట్టక్కర్లేదు
- ఆ బాధ్యత ఎమ్మెల్యే అభ్యర్థులే చూసుకుంటారు
- అందుకే పార్లమెంట్ సీటు ఎంచుకున్నాను
- ఓ ఇంటర్వ్యూలో టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్ వివాదాస్పద వ్యాఖ్యలు



సాక్షి, విశాఖపట్నం: 'ప్రభుత్వం అతి పెద్ద గూండా! అది వైఎస్సార్ సీపీ అయినా.. టీడీపీ ప్రభుత్వమైనా అంతే..'ఈ మాటలు అన్నది ఎవరో కాదు.. విశాఖ లోక్‌సభకు టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న శ్రీభరత్. ఈయన నటుడు బాలకృష్ణ చిన్నల్లుడు, నారా లోకేష్ తోడల్లుడు కూడా. ఇటీవల ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆ ఇంటర్వ్యూలో ఆయన ఏమన్నారంటే.. 'ప్రభుత్వంతో పని చేయడం తనకు అస్సలు ఇష్టం ఉండదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ పోట్లాడలేరు. చేసిన పనులకు బిల్లు పెండింగులో ఉంటే కోర్టుకెళ్తే వస్తుందనుకుంటున్నారా? రాదు.. వెయ్యి కండిషన్లు పెడతారు. ఏదో లోపం వెతుక్కుంటూ పోతారు. అందుకే ప్రభుత్వాలపై నాకు నమ్మకం కుదరదు' అని స్పష్టం చేశారు.

రాజకీయాల్లో డబ్బు ఖర్చు పెట్టే వారి దగ్గరకే ఎక్కువ మంది జనం చేరతారన్నారు. 'ఎక్కువ మంది మన గురించి మాట్లాడాలన్నా.. వారికి చేరువకావాలన్నా డబ్బు ఎక్కువగా ఖర్చు పెట్టాలి. కార్యకర్తలు రాజకీయ నాయకుడి దగ్గరకు విద్య, వైద్య, ఆరోగ్య అవసరాల కోసం వస్తుంటారు. పార్టీ కార్యక్రమాలు చేస్తున్నామని, గుడులు కడుతున్నాం విరాళాలివ్వండి అంటూ వస్తారు. నేను మనీ పాలిటిక్స్‌ను నమ్మను' అని పేర్కొన్నారు. అందుకే తాను ఎంపీగా పోటీ చేయాలని ఎంచుకున్నట్లు చెప్పారు. ఎంపీ అయితే డబ్బుల విషయంలో నేరుగా జోక్యం(డైరెక్ట్ ఇన్వాల్వ్‌మెంట్) ఉండదన్నారు. ఎంపీ అభ్యర్థయితే డబ్బు ఖర్చు పెట్టనక్కర్లేదని, తన లోక్‌సభ పరిధిలో పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానాల అభ్యర్థులే అవన్నీ భరిస్తారని కుండబద్దలు కొట్టారు. ఇప్పటికే శ్రీభరత్ ఎన్నికల ఖర్చుల విషయంలో క్యాడర్‌కు చుక్కలు చూపిస్తున్నారని టీడీపీ శ్రేణులు లబోదిబోమంటున్నారు. ఎన్నికల ఖర్చు విషయంలో ఆయన పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులపైనే భారాన్ని మోపారన్న విషయం తేటతెల్లమవుతోందని టీడీపీ నాయకులే చెబుతున్నారు. కోట్లకు అధిపతి అయిన శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించే బాధ్యతను తమపైకి నెట్టేయడమేమిటని అసెంబ్లీ అభ్యర్థులు కిందామీదా పడుతున్నారు. మొత్తం మీద శ్రీభరత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు అటు టీడీపీలోనూ, ఇటు సోషల్ మీడియాలోనూ బాగా వైరల్ అవుతున్నాయి.

ఎన్నికల వేళ బరితెగించిన టీడీపీ

- విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ
- ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం దాడులు
- రూ.59,600 స్వాధీనం

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ డబ్బులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుల నుంచి రూ.59,600లను ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఆదివారం మండలంలోని పలు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేయగా.. అతని అనుచరులు జనాన్ని కూడగట్టడానికి పెద్ద ఎత్తున డబ్బులు వెదజల్లారు. అందులో భాగంగా తర్లువాడ పంచాయతీలోని వెంకటాపురం మారేడుతల్లి ఆలయం వద్ద జగన్నాథపురం వెళ్లే మార్గంలో రాత్రి 12.20 గంటల ప్రాంతంలో డబ్బులు పంపిణీ చేస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ దాడి చేసింది. వారి నుంచి రూ.59,600 స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు నిందితులపై 171(ఇ), 171(హెచ్) ఆర్‌డబ్ల్యూ 188(క్రైం నంబర్104/2024) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5 లక్షల నగదు సీజ్

సీతమ్మధార: సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో తనిఖీలు చేపట్టిన ఎన్నికల అధికారులు.. ఓ వ్యక్తి నుంచి రూ.5లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. పుట్టా కల్యాణ శ్రీనివాస్ కారులో వడ్లాది మాడుగుల నుంచి సీతమ్మధార మీదుగా విశాలాక్షినగర్ వెళ్తున్నారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద స్టాటిక్ సర్వైలెన్స్-1, జోన్-3 రెవెన్యూ అధికారి కె.పైడిరాజు, ద్వారకా సీఐ ఎస్.రమేష్, హెడ్ కానిస్టేబుల్ జె.సురేష్‌కుమార్‌లు శ్రీనివాస్ కారును తనిఖీ చేశారు. కారులోని బ్యాగ్‌లో రూ.5లక్షల నగదు గుర్తించారు. దీనిపై శ్రీనివాస్‌ను ప్రశ్నించగా.. భూమి కొనుగోలులో భాగంగా అడ్వాన్స్ ఇచ్చేందుకు వెళ్తున్నట్లు ఆయన సమాధానం ఇచ్చారు. నగదుకు సంబంధించి పేపర్లు చూపాలని కోరడంతో లేవు అని చెప్పారు. దీంతో నగదును సీజ్ చేసినట్లు ఆర్వో డి.అఖిల వివరించారు.

నేడు జెడ్పీ సర్వ సభ్య సమావేశం

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంతో పాటు ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘాల సమావేశాలు మంగళవారం నిర్వహించనున్నట్లు సీఈవో ఎం.పోలినాయుడు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి మంగళవారం సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల వివిధ అంశాలపై ఎలాంటి చర్చ జరగదు. కేవలం హాజరైన సభ్యుల నుంచి సంతకాలు తీసుకొని సమావేశం ముగిస్తారు.

అభ్యర్థులు నైతిక విలువలు పాటించాలి

- ఎన్నికల పరిశీలకులు



ఎంపీ అభ్యర్థులతో సమావేశమైన పరిశీలకులు అమిత్ శర్మ, అమిత్ కుమార్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నైతిక విలువలు పాటించాలని, నిజాయతీగా వ్యవహరించాలని పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ, పోలీస్ పరిశీలకులు అమిత్ శర్మ, అమిత్ కుమార్ పిలుపునిచ్చారు. ఏ విధంగానూ హింసను ప్రోత్సహించొద్దని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. చిహ్నాల కేటాయింపులో భాగంగా విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం సమావేశమయ్యారు. అభ్యర్థులకు ఏమైనా సమస్యలుంటే 63003 10152(అమిత్ శర్మ), 63003 15841(అమిత్ కుమార్) ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి సాయంత్రంలోగా ఏజెంట్ల వివరాలివ్వండి

విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తమ ఎన్నికల ఏజెంట్ల వివరాలను మంగళవారం సాయంత్రంలోగా కలెక్టరేట్‌లో సమర్పించాలని ఆర్వో, కలెక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. ఫారం-8 ద్వారా రెండు సెట్ల వివరాలను అందజేయాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల వివరాలను మే 8వ తేదీలోగా, కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను మే 25లోగా అందజేయాలన్నారు. అభ్యర్థులకు యంత్రాంగం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, అదే విధంగా అభ్యర్థులు కూడా యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లింలకు భద్రత



మాట్లాడుతున్న ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని 12 మసీదు కమిటీల ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం షాదీఖానాలో సోమవారం జరిగిన ఈద్ మిలాప్ ఆత్మీయ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ ఏ విధంగా సంక్షేమ, అభివృద్ధి పాలన అందించారో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందేలా ప్రభుత్వ బడులు, ఆస్పత్రుల రూపు రేఖలు మార్చారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మెరుగుపర్చి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందేలా చర్యలు చేపట్టారన్నారు. ముస్లింల పట్ల బీజేపీ ఎటువంటి వైఖరి అనుసరిస్తుందో మీరంతా చూస్తున్నారని, అటువంటి బీజేపీతో అంటకాగుతున్న టీడీపీ, జనసేనకు ఓటేస్తే భవిష్యత్‌లో ఎటువంటి పరిస్థితి ఉంటుందో ఆలోచన చేయాలన్నారు. వైఎస్సార్ సీపీతోనే ముస్లింల అభివృద్ధి, భద్రత సాధ్యమన్నారు. మరోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత విశాఖ నుంచే పాలన కొనసాగిస్తానన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి.. వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థితో పాటు ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించి ఘన స్వాగతం పలకాలన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని, ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముస్లింల మసీదులు, ఈద్గా, ఖబర్‌స్తాన్‌ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి, శాసన మండలి ఉప చైర్మన్ పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దల చేతుల మీదుగా వై.వి.సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సీ, కె.కె.రాజు, ముఖ్య నాయకులను ఘనంగా సత్కరించారు. సభలో వైఎస్సార్ సీపీకి ముస్లింలంతా మద్దతు తెలిపారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే రెహమాన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.హెచ్.ఫరూఖీ, డాక్టర్ జహీర్ అహ్మద్, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, కె.వి.బాబా, రెహ్మతుల్లా బేగ్, హబీబ్, ముస్లిం మత పెద్దలు, 12 మసీదు కమిటీల అధ్యక్షులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో ముస్లిం యువత, మహిళలు పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలోని కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపై ఉన్న సంస్థ కార్యాలయంలో మే 2వ తేదీ నుంచి జూన్ 30 వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. రోజూ ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. శిక్షణ కోసం ఎటువంటి ఫీజు చెల్లించనక్కరలేదని, ఆసక్తి గల గృహిణులు ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999 నంబరులో సంప్రదించాలని కోరారు.

గీతం వర్సిటీలో సమావేశంపై చర్యలు తీసుకోండి

- సీఎం జగన్‌పై చంద్రబాబు వ్యాఖ్యలు అనుచితం
- వాటిపైనా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరిన వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర న్యాయ విభాగం ఉపాధ్యక్షుడు నీలాపు కాళీదాసు రెడ్డి

మహారాణిపేట: గీతం విశ్వవిద్యాలయంలో సోమవారం కేంద్ర మంత్రితో కార్యక్రమం నిర్వహించడం ఎన్నికల నియమావళికి వ్యతిరేకమని, దీనిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర న్యాయ విభాగం ఉపాధ్యక్షుడు నీలాపు కాళీదాసు రెడ్డి డిమాండ్ చేశారు. గీతం విద్యాసంస్థల చైర్మన్ ఎం.భరత్ పేరున సమాచారం పంపడం ఎన్నికల నియమావళికి పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. సోమవారం కాళీదాసు రెడ్డితోపాటు పలువురు నాయకులు జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కలిసి, చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. వికసిత్ భారత్ అంబాసిడర్ క్యాంపస్ డైలాగ్ పేరున విశాఖపట్నం పార్లమెంటు పరిధిలోని కొంత మంది వ్యాపారవేత్తలతో సమావేశం ఏర్పాటు చేయడం, ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ హాజరవడం, దీనికి టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి భరత్ పేరున ఆహ్వానాలు పంపారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎంపీగా పోటీ చేస్తున్న వ్యక్తికి సంబంధించిన విద్యా సంస్థలో ఈ విధంగా సమావేశానికి అనుమతి ఎలా ఇస్తారని కాళీదాసు రెడ్డి ప్రశ్నించారు.

చంద్రబాబు మాటలతో ప్రాణహాని

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి... రేపు నిన్ను చంపితే ఏమవుతుందని చంద్రబాబు అడగడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని నీలాపు కాళీదాసు రెడ్డి అన్నారు. ఈ నెల 27న నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రచారంలో చంద్రబాబు ఇష్టారీతిన మాట్లాడడం వల్ల భవిష్యత్‌లో సీఎం జగన్‌కు ప్రాణహాని కలిగే ప్రమాదం వుందన్నారు. తక్షణమే దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కాళీదాసు కోరారు. చంద్రబాబు వ్యాఖ్యలు ఎన్నికల నియమావళికి పూర్తిగా విరుద్ధమని, సీఎం జగన్ ప్రాణాలకు హాని కలిగించే విధంగా వున్నాయన్నారు.

2047 నాటికి వికసిత భారత్

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



ప్రసంగిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కొమ్మాది: ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ దేశమైనా ఆర్థికంగా వృద్ధి చెందలేదని, ఆ దృష్టితోనే భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచంలోనే మేటిగా నిలపడానికి ప్రధాని మోదీ వికసిత భారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గీతం వర్సిటీలో సోమవారం నిర్వహించిన వికసిత భారత్ క్యాంపస్ అంబాసిడర్ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. దేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు అమలైనప్పటికీ అప్పటి ప్రభుత్వంలో అవినీతి, సరైన నాయకత్వం లేకపోవడం వల్ల 2014 వరకు ఏ విధమైన ఎదుగుదల లేకుండా పోయిందన్నారు. మోదీ నాయకత్వంలో గడిచిన పదేళ్లలో ఘణనీయమైన ప్రగతి సాధించామని, ప్రపంచంలో ఆర్థికంగా 5వ స్థానంలో ఉన్నామన్నారు. రానున్న ఐదేళ్లలో మూడో స్థానంలో నిలపడానికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కృత్రిమ మేధ, గ్రీన్ హైడ్రోజన్ మిషన్, రక్షణ రంగంలో ఎగుమతుల ద్వారా రూ.20 వేల కోట్లు ఆర్జించామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సలహా తీసుకుంటూ దేశ జీడీపీని పెంచే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ముందుకెళ్తోందని పేర్కొన్నారు.


కంట్రోల్ రూమ్‌ల ఆకస్మిక తనిఖీ



కంట్రోల్ రూమ్ సిబ్బందితో మాట్లాడుతున్న అమిత్‌శర్మ, అమిత్‌కుమార్

మహారాణిపేట : విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ, పోలీసు పరిశీలకులు అమిత్‌శర్మ, అమిత్‌కుమార్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం అనంతరం కంప్లైంట్ మానిటరింగ్ సెల్, ఎంసీఎంసీ సెల్, మీడియా కేంద్రాన్ని సందర్శించారు. 24X7 వెబ్ కాస్టింగ్, ఫిర్యాదుల స్వీకరణ కేంద్రాల సేవలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ విధులు నిర్వర్తించాలని, తప్పిదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. వారి వెంట కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారి శ్రీనివాసఫణి, కలెక్టరేట్ ఏవో దేవ్‌ప్రసాద్ ఉన్నారు.

ఆర్మీ ఉద్యోగి మృతి



చిల్ల త్రినాథరెడ్డి (ఫైల్)

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటకు చెందిన ఆర్మీ ఉద్యోగి చిల్ల త్రినాథరెడ్డి సోమవారం కోల్‌కతాలో విధులు నిర్వర్తిస్తున్న చోట మృతి చెందారు. మృతికి కారణాలు తెలియరాలేదు. త్రినాథరెడ్డి భౌతిక కాయాన్ని మంగళవారం జీరుపేట తీసుకురానున్నారు. మృతుడికి భార్య పావని, రెండేళ్లు, మూడు నెలల చిన్నారులు ఉన్నారు. ఇటీవల త్రినాథరెడ్డి సోదరుడు శ్రీనివాసరావు అనారోగ్యంతో చనిపోయాడు. త్రినాథరెడ్డి మృతిపట్ల జీరుపేట, చిల్లపేట గ్రామాల్లో విషాదచాయలు అలముకున్నాయి.

దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో బ్లాస్టర్స్ జట్టు విజయం

విశాఖ స్పోర్ట్స్ : స్టేట్ అంతర జోన్ స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీలో సెంట్రల్ జోన్ బ్లాస్టర్స్ జట్టు 3 వికెట్ల తేడాతో సౌత్ జోన్ రాయల్స్ జట్టుపై విజయం సాధించింది. వైఎస్ఆర్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నీలో నార్త్‌జోన్ షార్క్స్ జట్టుతో సహా మూడు జట్లు పాల్గొంటున్నాయి. తొలి రోజు టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు 16.2 ఓవర్లు ఆడి 107 పరుగులకు ఆలౌటైంది. ప్రతిగా సెంట్రల్ జోన్ జట్టు 17.4 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 109 పరుగులతో విజయం సాధించింది. యశోధకృష్ణ 39 పరుగులు చేయగా.. రోషి ఐదు వికెట్లు తీశాడు. తొలుత ఈ పోటీలను వైఎస్ఆర్ స్టేడియంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొంటున్న మూడు జట్ల సభ్యులకు వసతి, భోజన సదుపాయం కల్పించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగుల కోసం టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసులకు పల్స్ యాక్టివ్ మిషన్ల అందజేత

- సీఎంఆర్ సంస్థ అధినేత మావూరికి పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు



సీపీ రవిశంకర్‌కు మిషన్లు అందజేస్తున్న మావూరి వెంకటరమణ

అల్లిపురం : సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ నగర పోలీస్ శాఖకు రెండు పల్స్ యాక్టివ్ స్టేషన్ బీఎంఎస్ మిషన్లు అందజేశారు. సోమవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది వీటితో యాక్సెస్ అయి తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ మిషన్ సిబ్బంది ఆరోగ్య వివరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, వారు ఎప్పుడైనా అనారోగ్యానికి గురైతే తక్షణం వారి మొబైల్‌కు హెచ్చరికలు జారీ చేస్తుందన్నారు. త్వరలో నగర పోలీసులు ఆరోగ్యంగా జీవించేలా కల్చర్ ఆఫ్ గుడ్ హెల్త్ అనే వినూత్న కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖకు సహకరించిన సీఎంఆర్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకట రమణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేసీపీ ఫకీరప్ప తదితరులు పాల్గొన్నారు.